

జగిత్యాల జిల్లా కథలాపూర్ శివారులోని వరద కాలువ వద్ద ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్‌లో నీళ్ల కోసం రైతుల ధర్నా

- నీటిని వదులుతామని విప్ ఆది శ్రీనివాస్ హామీ
- ససేమిరా అన్న రైతులు
- వెంటనే విడుదల చేసిన అధికారులు

కథలాపూర్, మార్చి 30 : వరద కాలువలోకి నీటిని వదలాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని బొమ్మెన, తక్కళ్లపెల్లి, భీమారం మండలం మన్నెగూడెం గ్రామాల రైతులు శనివారం కథలాపూర్ శివారులోని వరద కాలువ బ్రిడ్జిపై ధర్నా చేశారు. వరదకాలువలో నీళ్లు లేకపోవడంతో చేతికందే వరి పంట ఎండిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నివించుకున్నా ఫలితం లేదని ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరదకాలువ నిండా నీటితో కళకళలాడి పంటలు పుష్కలంగా పండేవని తెలిపారు. ప్రస్తుతం వరద కాలువలో నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు.

రైతులు ధర్నా చేస్తున్న సమయంలో అటుగా వెళ్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడామని, వరదకాలువలోకి నీళ్లు వదిలినట్టు రైతులకు తెలిపారు. నీళ్లు కథలాపూర్ వరకు చేరితేనే ధర్నా విరమిస్తామని వారు భీష్మించారు. ఎస్సై నవీన్ కుమార్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామశివారులోని వరదకాలువకు గల గేట్ ద్వారా నీళ్లను వదిలారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. రైతులు గంటసేపు బైఠాయించడంతో కోరుట్ల – వేములవాడ రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వాగులో చెలిమలు

పంటల సాగు కోసం రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. యాసంగిలో వరి, మక్కజొన్న పంటలను సాగుచేపట్టిన రైతులు వట్టెవాగులో చెలిమలు తవ్వుతూ పంటలను రక్షించుకునేందుకు నానాగోస పడుతున్నారు. వేలాది రూపాయలను వెచ్చించి వాగులో జేసీబీలతో చెలిమలను తవ్వుతున్నప్పటికీ పంటలను రక్షించుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - నెక్కొండ, మార్చి 30

సంక్షోభంలో వ్యవసాయం!

సాగునీరివ్వడంలో ప్రభుత్వం విఫలం.. ఎండుతున్న పంటలు.. ఇబ్బందుల్లో రైతులు

కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు బంద్.. చెరువులు, కుంటలు నింపని ప్రభుత్వం

పడిపోయిన భూగర్భ జలాలు.. వృథాగా పోతున్న ప్రాణహిత నీళ్లు

గ్రామాల్లో మళ్లీ బోరుబండ్లు, క్రేన్ల మోత.. ట్యాంకర్ నీళ్లే పంటలకు దిక్కు

కేసీఆర్ హయాంలో ఇలాంటి కరువెన్నడూ చూడలేదంటున్న రైతులు

హైదరాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ): 'పనిచేసి పదిమందిని సాకితే.. ఉపాయంతో ఊరందర్నీ సాకిండట' తెలివిమంతుడిని ఉద్దేశించి నానుడిలో ఉన్న సామెత ఇది. కాంగ్రెస్ పాలన, కేసీఆర్ పాలనా తీరుకు ఇది చక్కగా సరిపోతుంది. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి పంటలకు సాగునీరు అందిస్తే.. సాకులు చెప్పి కాళేశ్వరం నీటిని బంద్ చేసింది కాంగ్రెస్.బీఆర్ఎస్ హయాంలో నిరుడు యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీలో నీళ్లు తక్కువ కావడంతో వరంగల్‌లో కాకతీయ కెనాల్ పరిధిలోని పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. విషయం కేసీఆర్ దృష్టికి రాగానే సింగూరు డ్యాంలో నీళ్లుంటే అక్కడి నుంచి ఎస్సారెస్పీకి, అక్కడి నుంచి వరంగల్‌కు నీళ్లు అందించి పంటలు కాపాడారు. సాగునీటి కోసం ఒక ప్రాంతంలో రైతులు ఇబ్బంది పడుతుంటే, మరో ప్రాంతం నుంచి నీళ్లు తీసుకొచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుంది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లను ఎత్తిపోసి చెరువులు, ప్రాజెక్టులు నింపి యాసంగి పంటలకు సాగు నీళ్లు అందించి కరువు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యాసంగి పంటలకు సాగునీరు ఇవ్వలేక చేతులు ఎత్తేసింది. మేడిగడ్డ కుంగిందని, వానలు లేవని ఇలా సాకులు చెబుతూ సాగునీటిని విడుదల చేయకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండుతున్నాయి.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం తండాలో ఎండుతున్న వరి చేను

ఎండుతున్న పంటలు

కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిపివేయడంతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటిపోయాయి. ఫలితంగా నిరుడు 7.34 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలు ఇప్పుడు 8.70 మీటర్ల లోతుకు పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కొతరతో సుమారు 20 లక్షల ఎకరాల్లో వరిపంట ఎండిపోయినట్లు సమాచారం. మరో ఐదు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఎండిపోయినట్టు తెలిసింది. రాజకీయాలను పక్కనపెట్టి ప్రాజెక్టును రిపేర్ చేస్తే ఇప్పుడు ఈ సాగు నీళ్ల కొరత ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ బోర్ల చప్పుడు

కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగు నెలల పాలన రైతులకు మళ్లీ మునుపటి రోజులను గుర్తు చేస్తున్నది. గ్రామాల్లో మళ్లీ బోర్ల చప్పుడు మొదలైంది. బావుల వద్ద క్రేన్లు దర్శనమిస్తున్నాయి. కండ్లముందే ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లు వేయిస్తున్నారు. కొత్త బావులు తవ్విస్తున్నారు. బావుల్లో పూడిక తీయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 500 కొత్త బోర్లు పడుతున్నాయి. ఒక్క నల్లగొండ జిల్లాలో ఈ నెలలో దాదాపు 500 బోర్లు వేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులు ఒక్కో బోరుకు రూ. 60 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

నీటి నిల్వపై ధ్యాస ఏదీ?

మేడిగడ్డకు మరమ్మతులు చేసి నీళ్లు అందించే అవకాశం ఉన్నా బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం దానిని పక్కనపెట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరంలో కొంతమేరకు నీటిని నిల్వ చేసి ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ విచారణ పేరుతో ప్రభుత్వం ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్న విమర్శలున్నాయి. మేడిగడ్డ ప్రాజెక్టులోని ప్రాణహిత నుంచి నిన్నటి వరకు రోజూ సుమారు 5 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోయింది. ప్రస్తుత నీటి కొరతకు ఇది కూడా ఒక కారణమని చెప్తున్నారు.

ట్యాంకర్ నీటితో పంటసాగు

సాగునీరు లేకపోవడంతో పంటలు రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ నీటిని ఉపయోగించుకుంటున్నారు. వాటర్ ట్యాంకర్లు తెప్పించుకుని పొలాలకు పారించుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ సహా పలు జిల్లాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది.

కష్టాలు కొని తెచ్చుకున్నాం

పంటలకు సాగునీరు అందక ఓవైపు, కరెంటు కోతలు మరోవైపు, పంటలకు మద్దతు ధర దక్కక ఇంకోవైపు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే ఇన్ని కష్టాలు పడాల్సి వస్తుందని ఊహించలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ఏం చేసిండో, ఎలా చేసిండో తెలియదు కానీ, తమకు మాత్రం కష్టం రానివ్వలేదని గుర్తుచేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే తమను కష్టాలు చుట్టుముట్టాయని వాపోతున్నారు. ప్రభుత్వానికి ముందుచూపు కొరవడడం వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరంలో నీళ్లు నిల్వచేసి ఎత్తిపోసి చెరువులు, కుంటలు నింపితే ఇప్పుడీ పరిస్థితి వచ్చి ఉండేదని కాదని రైతులు, వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జీవనాడిగా కాళేశ్వరం

రాష్ట్రంలో వ్యవసాయరంగం ఎక్కువగా బోర్లు, బావులపైనే ఆధారపడి ఉంటుంది. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి భూగర్భ జలాలు పెరిగేలా చేస్తేగానీ సాగునీళ్లు అందని పరిస్థితి. దీనిని గుర్తించిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ వ్యవసాయ రంగానికి జీవనాడిగా మార్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా సుమారు 20–30 టీఎంసీల నీళ్లు ఎత్తిపోసి ఎస్సారెస్పీ, నిజాంసాగర్, మిడ్‌మానేరు, అప్పర్‌మానేరు, ఎల్ఎండీ, కాకతీయ కెనాల్‌కు నీళ్లు విడుదల చేసేవారు. ఈ ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు నీళ్లు విడుదల చేసి నింపేవారు. ఫలితంగా భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో పుష్కలమైన నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రంలో సుమారు కోటి ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. గత అక్టోబర్‌లో కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోయాయి. దీన్ని సాకుగా చూపిన కాంగ్రెస్ ఆ ప్రాజెక్టును పడావు పెట్టేసింది. ఆ ప్రాజెక్టులో నీళ్లు నింపడం, ఎత్తిపోయడం మొత్తానికే నిలిపివేయడంతో కాళేశ్వరం నుంచి నీళ్లు వెళ్లాల్సిన ప్రాజెక్టులన్నీ అడుగంటిపోయాయి.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం తండాలో ఎండుతున్న మక్కజొన్న చేను

సూర్యాపేట జిల్లా అనుముల మండలం పాలెం గ్రామంలో ఎండిన వరిచేనులో మేత మేస్తున్న పశువులు

కరువు కోరల్లో కర్షకులు

జనగామ, నల్లగొండ, సూర్యాపేటలో దుర్భిక్షం • 1.98 మీటర్ల లోతుకు పడిపోయిన జలాలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 30 (నమస్తే తెలంగాణ) / సూర్యాపేట / జనగామ : పదేండ్ల తరువాత మళ్లీ కరువు తరుముకొస్తున్నది. బోర్లు వేస్తే 80 ఫీట్ల లోతులో ఉబికి వచ్చే గంగమ్మ ఇప్పుడు 1.98 మీటర్ల లోతుకు పడిపోయింది. జనగామ జిల్లాలో గత ఏడాది 5.39 మీటర్లపైన ఉన్న భూగర్భ నీటి మట్టాలు..ఈ ఏడాది మార్చి వరకు 7.37 మీటర్ల లోతుకు పడిపోయాయి. కేవలం నెలరోజుల వ్యవధిలోనే 1.98 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోవడంతో కరువుఛాయలను సూచిస్తున్నాయి. జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. జిల్లాలోని ఏడు రిజర్వాయర్లు, 797 చెరువులు ఉండగా, అన్నింట్లోనూ నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఫలితంగా జిల్లాలో కేవలం 3నెలల వ్యవధిలోనే 50వేలకు పైగా బోర్లు ఒట్టిపోయాయి. దీంతో చివరి దశలో ఉన్న వరికి పూర్తిస్థాయిలో సరిపడా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలో చెరువుల ఆయకట్టు కింద 1.50లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యాన్ని నీటి పారుదలశాఖ అధికారులు లక్ష ఎకరాలకు కుదించామని చెబుతున్నా..వాస్తవానికి జిల్లాలో 50వేల ఎకరాల లోపు పంటలకే నీరు అందడంలేదు. దేవరుప్పుల, జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, లింగాలఘనపురం, నర్మెట, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాల్లో ఇప్పటికే వరి ఎండిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

ఇద్దరు మంత్రులు ఉన్నా...

ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా కేసీఆర్ సర్కారు నీళ్లిచ్చి రైతాంగాన్ని ఆదుకున్నది. నేడు ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు సాగర్, కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయించుకుండా చేతులెత్తేశారు. ఫలితంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3లక్షల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. పండ్ల తోటలు కూడా తూడ్చుకుపెట్టుకుపోయాయి. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 40 వేలకు పైనే ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. 2015లో సాగర్‌లో 508 అడుగుల మేర నీరు ఉన్నా కేసీఆర్ సర్కారు పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేసింది. ఈసారి 515 అడుగులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లివ్వడం లేదు. కనీసం ఎండిన పంటల వైపు చూసి, రైతాంగానికి భరోసా ఇచ్చిన ప్రజాప్రతినిధి లేరు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ప్రస్తావనే లేదు. ఈ నేపథ్యంలో తీవ్రంగా కుంగిపోతున్న రైతాంగాన్ని చూసి చలించి భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు జనగామ, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటనకు వస్తున్నారు.

సర్కారు నిర్లక్ష్యంతో ఎండిన పంటలు

కేసీఆర్ సర్కారులో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కుంటలు, చెరువులు నింపేవారు. దాంతో బోర్లలో, బావుల్లో నీళ్లు ఉండేవి. కాల్వల ద్వారా నీళ్లు వచ్చేవి. పంటలు బాగా పండాయి. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని వదలడంతో పది రోజులకు పైగా అధికారులు నిర్లక్ష్యం చేశారు. నేడు 11 ఎకరాల్లో వరి పెట్టిన. పంట పూర్తిగా ఎండిపోయింది. నాలుగు లక్షలకు పైగా పెట్టుబడి నష్టపోయా.

- దయ్యల లింగయ్య, రైతు, వెలుగుపల్లి, తుంగతుర్తి మండలం



జనగామ జిల్లాలోని జనగామ మండలం మరిగడి పెద్దతండా(ఎం)లో ఎండిపోయిన తన వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు గుగులోత్ నర్సింహ

సాగు నీళ్ల కొరతతో ఎండుతున్న పంటలు

రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం

ఎకరానికి సగటున 25వేల పెట్టుబడి నష్టం

ఆర్థికంగా చితికిపోయి అప్పులపాలవుతున్న రైతులు

సాగు నీళ్లపై చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఎండిన పంటలను కన్నెత్తి చూడని మంత్రులు

హైదరాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ) : రైతుల రెక్కల కష్టం అగ్గిపాలవుతున్నది. పంటలన్నీ ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్నాయి. కాల్వల్లో నీళ్లు లేక.. చెరువులు, కుంటలు నోళ్లు తెరుచుకున్నాయి. బోరు బావులన్నీ భోరుమంటున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంటలకు తడి అందక ఎండిపోయి.. రైతులకు గుండె తడే మిగిలిస్తున్నది. మూడు తడులు పారిస్తే చేతికొస్తదనుకున్న పంటల కోసం రైతులు ట్యాంకర్లతో తిప్పులు పడుతున్నారు. పెట్టుబడిపై కడుపు మండిన రైతన్న పంటకు నిప్పు పెడుతున్నాడు. నిస్సహాయంగా ఉన్న రైతులు పశువులకు మేతగా మార్చుతున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పాలనలో కష్టాలు ఎక్కిరిస్తుంటే.. ఎక్కి ఎక్కి ఏడ్చిన రైతుల కన్నీళ్లు ఇంకిపోతున్నాయి.

జనగామ మండలం సిద్దెంకిలో నీరులేక ఎండిపోయిన వరి పొలంలో రైతు చెన్నూరి భాగ్య

కాంగ్రెస్ కక్షతోనే కరువు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యాసంగిలో 72 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అయినా.. ఎక్కడా ఎకరం ఎండలేదు. ఎండు కంటే ఎర్రటి ఎండల్లో కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోస్తే.. నడి ఎండకాలంలో చెరువులు, కుంటలు మత్తళ్లు దూకాయి. అప్పుడు భూగర్భ జలాలు పెరిగి భూమికి బరువయ్యేంత పంటలు పండాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. మేడిగడ్డ సాకు చూపి సాగునీళ్లకు ధోకా చేసింది. రైతులను నట్టేట ముంచింది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఎండిన పంటలే దర్శనమిస్తున్నాయి. సాగు నీళ్ల కొరతతో ఇప్పటికే 20 లక్షల ఎకరాలు ఎండిపోయినట్లు అంచనాలున్నాయి. వచ్చే నెల రోజుల్లో మరో 5–10 లక్షల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉన్నది. మొత్తం మీద దాదాపు 30 లక్షల ఎకరాల వరకు పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. ఈ యాసంగిలో మొత్తం 67 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఇందులో గరిష్ఠంగా 51 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అత్యధికంగా 11 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఇప్పటికే 4 లక్షల ఎకరాలకుపైగా ఎండిపోయినట్లు తెలిసింది. ఇలా ఈ ఒక్క జిల్లానే కాదు.. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపులు, అవగాహన రాహిత్యమే సాగునీటి కొరతకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎకరాకు రూ. 25వేల నష్టం....

ఈ యాసంగిలో సాగుకు పెట్టిన పెట్టుబడి నష్టపోయి రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. వరి సాగుకు ఎకరాకు కనీసం రూ. 30 వేల నుంచి 35వేల వరకు పెట్టుబడి అవుతుంది. కోత దశలో ఎండిపోవడంతో కోతలు, ఇతర ఖర్చులు మినహాయిస్తే ఎకరాకు రూ. 25వేల వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ. 5వేల కోట్ల నష్టం జరిగిందనే అంచనాలు ఉన్నాయి. ఒక్క సీజన్‌లోనే కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వకపోవడం వల్ల రైతులకు ఇంత భారీ స్థాయి నష్టం వాటిల్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ నేతలు బిజీ బిజీ

పంటలు ఎండిపోయి రైతులు రందిలో ఉంటే .. కాంగ్రెస్ నేతలు లోక్‌సభ ఎన్నికలు, టికెట్లు, ఫిరాయింపులు, బుజ్జగింపుల్లో బిజీగా ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఢిల్లీలో నుంచి గల్లీ వరకు చక్కర్లు కొడుతున్నారు. కానీ పుట్టెడు దు:ఖంలో ఉన్న రైతులను పట్టించుకోవడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కనీసం ఎండిన పంట వైపు కన్నెత్తి చూడటం లేదు. దీన్ని బట్టి కాంగ్రెస్ పార్టీకి రైతులపై ఎంతటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

పొలం ఎడారి.. రైతుగుండె తడారి!

కాంగ్రెసొచ్చింది... కాల్వలెండినయ్

పదేండ్ల నుంచి సల్లగ బతుకుతున్నం. ఈసారి కాంగ్రెసొచ్చింది. కాల్వలు ఎండినయ్. ఎప్పుడు పెట్టినట్టే యాసంగి దినం 8 ఎకరాలు నాటు పెట్టినం. కాల్వల్లో నీళ్లు రాక బోర్లల్ల నీళ్లు లేక ఐదెకరాల పొలం నెర్రెలు పట్టింది. పచ్చగున్న మూడెకరాలు వరుస తళ్లు తిప్పుతున్నంగాని నమ్మకం తక్కువే. ఈ సారి పట్టుబడి మునుగుడే. రూ. 2 లక్షలు అప్పుతెచ్చి మూడు బోర్లేస్తే పడలే. రైతు బంధు వస్తే చేతుల మీద పెట్టుబడి ఎల్లేది. అది రాక పెట్టుబడికి సావుకార్ల దగ్గరికి పోవాల్సివచ్చింది. ముందు తిప్పలే ఉన్నది. ఇగ మంచి నీళ్లన్న ఇస్తరా చూడాలె.

- కున్సోతు జ్యోతి, ధరావత్ తండా, దేవరుప్పుల

పశువులకు మేతగా ఎండిన పొలాలు

- ముత్తారం మండలంలో సాగునీటికి కటకట
- సీతంపల్లి, ఇప్పలపల్లిలో ఎండుతున్న పంటలు

ముత్తారం, మార్చి 30: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఎస్సారెస్పీ డీ–83 కెనాల్‌ను నమ్ముకొని సాగు చేసిన సీతంపల్లి, ఇప్పలపల్లిలోని సుమారు 700 ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొన్నది. సాగు ప్రారంభ సమయంలో డీ–83 కెనాల్ నీరు విడుదల చేయడంతో రైతులు సంబురపడ్డారు. నీళ్లు వస్తాయని దండిగా సాగు చేశారు. కానీ చుక్క నీరు రాకపోవడంతో పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పంట పొట్ట దశకు చేరింది. నీళ్లు లేక ఎండిపోతున్నది. నీటిని విడుదల చేయాలని అధికారులను కోరినా లాభం లేకపోవడంతో కడుపుమండి పశువులను మేపుతున్నారు.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపేటలో ఎండిన తన పొలంలో పశువులను మేపుతున్న రైతు బోయిని రాజమల్లు

నీళ్లు రావని చెప్తే సాగు జోలికి పోకపోదుం

కెనాల్ నీళ్లు రావని అధికారులు ముందే చెబితే మేం పంట సాగు జోలికి పోకపోదుం. వరి వేయకపోయేటోళ్లం. కెనాల్ నీళ్లు వస్తయని ఆశతో నేను ఆరెకరాల్లో వరి వేసిన. కానీ ఒక్కసారి వచ్చిన నీళ్లు మళ్లీ రాలేదు. చేసేదేం లేక పొట్టదశలో పంటను విడిచిపెట్టిన. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టిన. మమ్ములను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- బోయిని రాజమల్లు, సీతంపేట